# ఇల్లు నిండిన వస్తువు

బారు సరోజినీ దేవి

లక్ష్మీపురంలో రామశర్మ అనే బ్రాహ్మణుడు వుండే వాడు. అతడు కడు బీదవాడు. భగవంతుడు ఎప్పుడు బీదలకే సంతానాన్ని ఎక్కువగా ప్రసాదిస్తాడు. లక్షల కొద్దీ డబ్బున్న భాగ్యవంతులకు ఎంత తపస్సుచేసినా ఒక్క బిడ్డ కూడ కలుగక పోవడము చూస్తూ వున్నాము. అలాగే రామశర్మ ఎంతబీదవాడో సంతానం అంత ఎక్కువ. ప్రతిరోజు భార్య తెల్లగా తోమియిచ్చిన రాగిచెంబు పట్టుకొని చుట్టుపక్కల ఊళ్లకు వెళ్ళి ఉపాదానం చేసుకొనివచ్చేవాడు. ఆ వచ్చిన బియ్యంతోనే చాలీ చాలని వంటచేసుకొని సగం కడుపులే నింపుకొని జీవిస్తూవున్నారు.

లక్ష్మీదేవి, జ్యేష్ఠాదేవి, అక్కచెల్లెండ్రు అని అందరకు తెలుసు. లక్ష్మీ ఏ యింట్లో వుంటే ఆ యిల్లు భోగభాగ్యాలతో తులతూగుతూ వుంటుంది. జ్యేష్టాదేవి వున్న యిల్లు దానికి వ్యతిరేకంగా వుంటుంది. జ్యేష్టాదేవి వున్న యింటిలో దరిద్రం 'ఓ' అని పిలిస్తే పలుకుతూవుంటుంది.

ఒకరోజున లక్ష్మి, జ్యేష్ఠా, ఒక రావిచెట్టుక్రింద నిలబడివున్నారు. ఆ సమయంలో రామశర్మ చెంబు పట్టుకొని వస్తున్నాడు. లక్ష్మికి ఆ బ్రాహ్మణుని చూచేసరికి జాలి వేసింది. అప్పుడు జ్యేష్ఠాదేవి వేపు తిరిగి "అక్కా ఆ బ్రాహ్మణుడు దరిద్రంతో ఎన్నో సంవత్సరాల నుంచి బాధపడుతున్నాడు. ఇప్పటికయినా అతన్ని నువ్వువదలిపెట్టు. ఇంక నేను అతన్ని బాగుచేస్తాను" అని అంది. కాని జ్యేష్ఠాదేవి దానికి ఒప్పుకోలేదు: "చెల్లీ, లక్ష్మీ! ఇంకా అతని కర్మ పరిపక్వం కాలేదు. అందుచేత నేను అతన్ని యింకా వదలను" అంది. ఆ మాటకు లక్ష్మి "అయితే నేను అతన్ని బాగుచేస్తాను చూడు" అంది. "నీవు ఏ విధంగాను నన్ను గెలవలేవు" అంది జ్యేష్ఠ. ఈ విధంగా లక్ష్మి, జ్యేష్ఠా చాలపట్టుదలగా మాట్లాడుకొన్నారు.

ఇంతలో ఆ బ్రాహ్మణుడు ఆ చెట్టుదగ్గరకు వచ్చాడు. లక్ష్మి ఆ బ్రాహ్మణుని "ఓ బ్రాహ్మణుడా ఇలారా" అని పిలిచింది. ఆ బ్రాహ్మణుడు ఆ మాటకు తల పైకి ఎత్తిచూచాడు. ఒకామె నగలు నాణ్యాలతో కలకలాడుతూ లక్ష్మీదేవిలా అగుపడింది. రెండవ ఆమె చింపిరిజుట్టు, చిరిగిన బట్టలతో చూచేందుకు భయంకరంగా వున్నది. రామశర్మ ఎప్పుడూ అచ్చట జనసంచారము చూడలేదు. అటువంటిది ఆ స్త్రీలను చూచి ఆశ్చర్యపోయాడు. లక్ష్మి పిలుపుకి ఆమెదగ్గరకు వెళ్లాడు. లక్ష్మి ఆ బ్రాహ్మణునితో "ఓ బ్రాహ్మణుడా! నీ బీదరికం చూస్తూవుంటే నాకు చాల జాలి కలుగుతోంది. నీ బీదరికాన్ని పోగొట్టుటకే నిన్ను పిలిచాను," అంటూ ఆమె మెళ్ళోవున్న కంటె తీసి రామశర్మకు ఇచ్చి "ఈ కంటె



నీ భార్య చేతికి యిచ్చి రోజూ పూజ చేస్తూవుండమను. ఈ కంటెలో ఓ చిన్న ముక్క తీసుకొని నీకు కావసిన సామగ్రి కొనుక్కుంటూవుండు. తిరిగి తెల్లవారేసరికి ఆ ముక్కతో సహా కంటె పూర్తిగా వుంటుంది" అని చెప్పింది. రామశర్మ సంతోషముతో ఆ కంటె తీసుకొని అంగవస్త్రములో చుట్టుకొని చంకలో పెట్టుకొని వెళ్ళిపోయాడు. అప్పుడు లక్ష్మి "అక్కా చూడు, నా మహిమ. ఈ బ్రాహ్మణుని భాగ్యవంతునిగా చేస్తాను" అని అంది. కాని జేష్ఠాదేవి లక్ష్మితో "పిచ్చిదాన! నా ముందు నీ మహిమ గొప్పది కాదు. ఈ బ్రాహ్మణుని యింకా దరిద్రముచేత బాధపడేటట్టే వుంచదలచాను. నా మహిమచూడు అంది." ఈ విధంగా లక్ష్మి, జ్యేష్ఠలు పందెంవేసుకొన్నారు.

రామశర్మ నగందూరం వెళ్లి మంచినీళ్లు త్రాగడానికి అక్కడకు దగ్గరలోనున్న కాలవగట్టు దగ్గరకు వెళ్ళాడు. అతను లేచేటప్పుడు ఆ కంటె మూటలోనుంచి జారి క్రింద పడిపోయింది. రామశర్మ అది గమనించకుండా తొందరగా వెళ్లిపోయాడు. ఆ కంటె త్రోవన పోతున్న బాటసారికి దొరికింది. ఆ బాటసారి ఊళ్లోకి వెళ్ళి ఒక కోమటికి అయిదువందలకు ఆ కంటె అమ్మేశాడు. ఆ కోమటి ఈ వస్తువు దొంగవస్తువేమో అని భయంకొద్దీ కొన్నిరోజులుపోయిన తరువాత యింటికి పట్టుకొని వెళ్లవచ్చునని తన గల్లాపెట్టెలో ఆ కంటె పడేశాడు.

ఆ రోజు రామశర్మకు రోజు దొరికేటన్ని బియ్యంకూడ దొరకలేదు. ఇంటికివచ్చి చెంబు భార్య చేతికిచ్చి చంకలోనున్న అంగవస్త్రము తీశాడు. కాని ఆ కంటె అగుపడలేదు. బట్టలు అన్నీ బాగా దులిపి చూచాడు. ఏమీ అగుపడలేదు. భార్య "ఏమిటి వెతుకుతున్నారు" అని అడిగింది. రామశర్మ ఆ మాటకు వస్తువ ఎలాగ పోనే పోయినది కదా! ఇంక భార్యతో చెప్పడం ఎందుకని ఏమిలేదని ఊరుకున్నాడు. ఆ మరుచటి రోజు రామశర్మ మామూలు ప్రకారమే చెంబు పట్టుకొని బయలుదేరాడు. ఆ చెట్టుక్రింద తిరిగి అక్కచెల్లెళ్లు నిలబడి వున్నారు. "నా మహిమ చూచావా" అని గర్వంగా జ్యేష్ఠ అంది. ఆ మాటకు లక్ష్మి "ఈ రోజు చూడు నా మహిమ" అంది.

రామశర్మనుచూచి "ఓ బ్రాహ్మణుడా ఇలారా" అంది. రామశర్మ వాళ్లదగ్గరకు వచ్చుటకు భయపడ్డాడు. లక్ష్మీదేవి బలవంతంచేత రాకతప్పలేదు. నేనుయిచ్చిన కంటె వుందా అని అడిగింది. ఆ మాటకు



గొల్లభామ పాలు
గడ్డకట్టించిన తీపిపాలు
ఆరోగ్యవంతమైన పాలునిచ్చునది.
ఈ పాలనుగురించిన వివరములుగల కరపత్రము, ఇంగ్లీషు, అరవము, తెలుగు లేక మళయాళములో కోరినవారికి పంపగలము.
నెజ్సెల్సు, పి. ఓ. బాక్సు. 180, మదరాసు-1.
NMM/G/2B.

# ★ ఇల్లునిండిన వస్తువు ★

రామశర్మ "అమ్మా నీవు యిచ్చిన కంటె ఎక్కడనో జారిపడిపోయింది" అని అన్నాడు. "పోనీలే ఇప్పుడు వడ్డాణం ఇస్తున్నాను. ఇదికూడా పోకుండా మొలకు పెట్టుకో దీన్ని కూడా పెట్టెలో పెట్టి పూజచేస్తూ వుండమని నీభార్యతో చెప్పు." అని చెప్పియిచ్చింది. రామశర్మ ఆ వడ్డాణం తీసుకొన్నాడు. కాని అతనికి పెట్టుకోవడం చేతకాలేదు. నడుముకి వడ్డాణం పెట్టుకొని పైని అంగవస్త్రము చుట్టపెట్టుకొని వెళ్లిపోయాడు. అతని దురదృష్టంచేత అదికూడ జారి ఎక్కడో పడిపోయింది. అదికూడా ఒక బాటసారికి దొరికింది. ఆ బాటసారి కూడ మునుపు కంటె అమ్మిన కోమటికే అమ్మేశాడు. కోమటి ఆ వస్తువుకూడ దొంగవస్తువని అనుమానంతో గల్లాపెట్టెలోనే పడేశాడు.

మరుచటిరోజు రామశర్మ మామూలు ప్రకారం బయలుదేరాడు. ఈమాటు వాళ్లు పిలిచినా వెళ్లకూడదని అనుకొన్నాడు. "అక్కా నీమాటే నెగ్గింది. ఆ రెండు వస్తువులుకూడ అతనికి దక్కకుండా చేశావు. ఈమాటు అయినా ఆ బ్రాహ్మణుని ఒదలిపెట్టు" అని లక్ష్మి జ్యేష్ఠాదేవిని బ్రతిమాలుకొంది. జ్యేష్ఠకుకూడ ఆ బ్రాహ్మణునిమీాద దయకలిగింది. "చెల్లీ అతనికర్మ ఈరోజుతో పూర్తిఅయిపోయింది. ఇంక నేను అతన్ని ఒదిలిపోతున్నాను." అని చెప్పింది. ఇంతలో రామశర్మ ఆ చెట్టుదగ్గరకు వచ్చాడు. లక్ష్మి అతన్ని పిలిచింది. కాని రామశర్మ "అమ్మా! మీాకో నమస్కారం. నన్ను ఇలా బ్రతకనీయండి. మీా రిచ్చిన వస్తువులా నాకు దక్కలేదు. మీారు కనపడిన దగ్గరనుంచి నా దరిద్రంకూడ ఎక్కువయిపోయింది. నన్ను నా దారిని పోనీయండి" అంటూ రామశర్మ పోబోయాడు. లక్ష్మి అతన్ని పోకుండా ఆపుచేసి" ఓ "బ్రాహ్మణుడా ఈరోజు నీ అదృష్టము పండుతుంది. నామాట నమ్మ. ఇదిగో ఈ రాగికాని తీసుకొని వెళ్లి నీ భార్యచేతికిచ్చి, ఇల్లునిండిన వస్తువు, కొనమని చెప్పు"అని ఒక రాగికాని రామశర్మచేతిలో పెట్టింది. రామశర్మ ఆ కాని తీసుకొని బయలుదేరాడు. "అంతబంగారు వస్తువులు యిచ్చినప్పుడే నాకు దక్కలేదు. ఇంక ఈ రాగి కానీకి ఏమివస్తుంది? ఒక్క కానీతో యిల్లునిండినవస్తువు మాత్రం ఏదివస్తుంది. అయినా నా భార్యకి యిస్తాను, ఎలాగవుతే అలా అవుతుం"దని రామశర్మ మనస్సులో అనుకొన్నాడు.

ఆరోజు రోజుకన్న బియ్యం ఎక్కువ దొరికాయి. ఇంటికి వచ్చి భార్యతో తనకు రెండురోజులనుంచి అగుపడిన స్త్రీలనుగురించి వారుయిచ్చిన వస్తువులు గురించి చెప్పాడు. తరువాత రాగి కాని భార్యచేతిలో పెట్టాడు. ఆమె సంతోషముతో లక్ష్మీదేవే మనకు ఈ రాగికాని యిచ్చిందేమో అని కానీకి యిల్లునిండిన వస్తువు ఏది వస్తుందా అని ఆలోచనలోపడింది. చటుక్కున ఆమెకు ఆలోచన తట్టగానె ఆమె ముఖము కలకలలాడింది. వెంటనే ఓ దమ్మిడి ప్రమిద, ఓదమ్మిడి ఆముదము, దమ్మిడీ ఒత్తి తెప్పించింది. సాయంత్రము అవగానే ప్రమిదలో ఆముదముపోసి ఒత్తివేసి దిపం వెలిగించింది. చావడి

బాలసుధ
బాలుర సమస్త వ్యాధులను పోగొట్టును
బాలసుధ
మాకు కావలెను
మాకు కావలెను

శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి అండ్ సన్స్,
రాజమండ్రి.

మధ్య ఆ దీపంపెట్టింది. ఆ దీప కాంతికి యిల్లు నాలుగుమూలలా కలకల లాడుతూ కాంతితో ప్రకాశిస్తోంది.

వాళ్లయింటికి ఎదురుగుండానే కంఠె, వడ్డాణం కొన్న వర్తకుని దుకాణంవుంది. ఎప్పుడూ రామశర్మ యింట్లో దీపంపెట్టి ఎరుగరు. అటువంటిది ఈరోజుదీపంచూచి వర్తకుని ఆశ్చర్యపోయాడు. అప్పుడు తన దగ్గరనున్న వస్తువులు చటుక్కున జ్ఞాపకం వచ్చాయి. ఇవి దొంగ వస్తువులయితే ఏ రాజభటులయినా తనని పట్టుకొంటారని భయం వేసింది. "ఈ బ్రాహ్మణుడు ఎలాగూ బీదవాడు ఈ వస్తువులు వాళ్ల దొడ్లో పడేస్తే మంచిది. ఏ పోలీసులయినా ఆ వస్తువులుచూచి అతన్నే పట్టుకొని పోతా"రని నిశ్చయించుకొని, రాత్రివేళ రామశర్మ దొడ్డి గోడకు నిచ్చెన వేసుకొని ఆ వస్తువులు రెండూ వాళ్లదొడ్లోకి విసిరేసి యింటికివచ్చిన నిశ్చింతగా పడుకొన్నాడు.


తెల్లవారుఝామున రామశర్మ భార్య దొడ్లోకి వెళ్లి చీపురితో దొడ్డి తుడుస్తుంటే నూతి దగ్గర తళ, తళ మెరుస్తూ కంఠె, వడ్డాణం అగుపించాయి. ఆమె అవి చూచి కంగారుపడి భర్తను లేపింది. రామశర్మ ఆ వస్తువులుచూచి ఆశ్చర్యముతో "నాకు ఆరోజు ఈ వస్తువులనే ఆమె యిచ్చింది"అని భార్యతో చెప్పాడు. ఆమె సంతోషముతో లక్ష్మీదేవే మనకు ఈ వస్తువులను ప్రసాదించింది, అని ఆ వస్తువులు రెండూ తీసుకొని లక్ష్మీదేవిపెట్టెలో పెట్టుకొని రోజుపూజిస్తూ వుండేది. వాళ్లకుడబ్బు కావలసి వచ్చినప్పుడు దానిలో ఒకముక్క తీసుకొని అమ్మి కావలసిన సామగ్రి కొనుక్కొనేవారు. తెల్లవారేసరికి ఎందులో ముక్కతీసినా ఆ వస్తువు తిరిగి పూర్తిగా వుండేది. ఆరోజునుంచి వాళ్లని జ్యేష్టాదేవి వదలి, లక్ష్మి పట్టింది. అందుకే ఇప్పటికీ పెద్దలు శ్రావణ శుక్రవారం కాని శ్రావణ మంగళవారం కాని బంగారాన్ని పెట్టెలో పెట్టి పూజచేస్తూ వుంటారు. శ్రావణమాసంలో క్రొత్తకోడళ్లని తీసుకొచ్చి తప్పకుండా బంగారం పెట్టి పూజచేయిస్తారు. ★

శ్రీమదాంధ్ర
మహాభారతము
ఉద్యోగపర్వము
వెల రూ. 1-0-0
ఆంధ్రగ్రంథమాల, మద్రాసు.

ఈ అద్భుతమైన క్రొత్త రేడియో బ్యాటరీని
మీ సెట్టుకు వాడిచూడండి

శక్తి
ఇమిడియున్నదీ
కొనుటకు చవుక అయినదీ
నమ్మకము గలిగినదీ
దీర్ఘకాలము పనిచేయునదీ

ఇతర రేడియో బ్యాటరీలవలెగాక ఈ "ఎవరెడీ" "మినిమాక్సు" రేడియో బ్యాటరీలలో అధికశక్తినిచ్చు పదార్థములు ఎక్కువగా ప్రతి ఘనాంగుళమునందు యిమిడ్చబడినవి. ఈ సెల్లు చదునుగానూ, పలుచగానూ నిర్మింపబడి తక్కువ సైజు బరువును గలిగియున్ననూ, పూర్తిశక్తినిచ్చి దీర్ఘకాలము పనిచేయును.




మీరిచ్చు డబ్బు దాని నాణ్యమైన పనితనమునకు గాని, ప్యాకింగుకు గాదు.

EVEREADY
TRADE MARKS
MINI-MAX
ఎవరెడీ మినిమాక్సు రేడియో బ్యాటరీలు
నేషనల్ కార్బన్ తయారు

NCM 3903